క్లుప్తంగా

క్షయ నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణదాస్

సత్యవేడు: క్షయ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణదాస్ తెలిపారు. మంగళవారం కాళనాయుడుపేట సచివాలయం పరిధిలోని నరసరాజు అగ్రహారంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కృష్ణదాస్ మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు వస్తుంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే పూర్తి స్థాయిలో ప్రభుత్వమే ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మునిలక్ష్మీ, ఎంఎల్‌పీహెచ్ సుమ, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ఏఎస్ఎం రోషి, సుబ్రమణ్యం, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలెవరూ చెత్తను బయట పారవేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు చెత్త అందివ్వాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్తతో వర్మి కంపోస్టు ఎరువులను తయారు చేసి అమ్మకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చిరంజీవి, ఉపసర్పంచ్ మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రానికి ఫెన్సింగ్



సంపద తయారి కేంద్రం చుట్టు ఫెన్సింగ్ వేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి మునెమ్మ తెలిపారు. సంపద తయారీ కేంద్రం చెరువు పక్కనే ఉండడంతో పశువులు, పందులు, కుక్కలు ప్రవేశించి చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయని, దీంతో ఇబ్బందిగా ఉందని తెలిపారు. పంచాయతీ నిధులతో సంపద తయారీ కేంద్రం చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫెన్సింగ్ ఏర్పాటుతో జంతువుల బెడద తీరుతుందని తెలిపారు. త్వరలో చెత్తతో వర్మికంపోస్టు ఎరువులనుతయారుచేసి అమ్మకాలు జరుపుతామన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలు అందజేస్తున్న ఎంఈఓ ఉష

సత్యవేడు: మహాత్మ జ్యోతిరావ్ పూలే సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. మంగళవారం దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణదాస్, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ కలసి విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. జూన్ నెలలో రాష్ట్రీయ బాల కిశోర సంస్థ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఎం.రాజ్‌కుమార్, ఎం.శశాంక్ శివ, పి.రాజవినయ్, ఎ.చరణ్, జి.సంతోష్, జి.విష్ణువర్ధన్, ఎస్.శ్రీచైతన్యలకు కంటి చూపు సరిగా లేదని గుర్తించారు. ఆ విద్యార్థులకు కంటి అద్దాలను డాక్టర్లు ప్రత్యూష, ప్రసాద్, గుణశేఖర్ కలసి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 ఉషా, ఉపాధ్యాయులు, ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం.. వసూళ్లమయం



వరదయ్యపాళెంలో నిర్మాణ దశలో ఆగిపోయిన జంతు వధశాల గదులు

మండల కేంద్రంలోని వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పాలకుల వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. కనీసం పంచాయతీ పరిధిలో పంచాయతీకి చెందిన జంతు వధశాల (మాంసపు మార్కెట్) లేకనే ప్రతి ఏడాది జంతు వధశాల పేరిట వేలం నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా జంతు వధశాల, మార్కెట్ గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోంది. మాంసపు మార్కెట్‌ను కైవసం చేసుకునేందుకు పోటాపోటీగా ప్రైవేటు కాంట్రాక్టర్లు హెచ్చుపాటలతో జంతువధశాలను కైవసం చేసుకుంటున్నారు. తద్వారా పంచాయతీ పరిధిలో ఉన్న మాంసపు దుకాణాల వద్ద ముక్కు పిండి వసూలు చేసి పబ్బం గడుపుకుంటున్నారు. అయితే ఏకంగా ప్రైవేటు అద్దె భవనాల్లో మాంసపు దుకాణాలు నిర్వహిస్తున్న వారి నుంచి సైతం వసూలు చేస్తున్నారు. ఏకంగా ఒక్కో దుకాణదారుడి నుండి వారానికి తక్కువ మొత్తంలో రూ.300 నుండి రూ. 600 దాకా వసూలు చేస్తుండడం గమనార్హం.

– వరదయ్యపాళెం

- మాంసం దుకాణాల వద్ద అపరిశుభ్రత
- మేజర్ పంచాయతీలో అటకెక్కిన జంతు వధశాల పనులు
- పంచాయతీ పరిధిలో మాంసం దుకాణాల వద్ద అక్రమ వసూళ్లు
- జంతు వధశాల వేలంలో పోటాపోటీగా హెచ్చుపాట
- పంచాయతీ పరిధిలో జంతు వధశాల లేకనే వేలం పాట
- పూర్తి కాని మాంసం మార్కెట్ గదుల నిర్మాణం

ఈ ఏడాది మార్చిలో వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో జరిగిన వేలం పాటలో జంతు వధశాలకు సంబంధించి వేలం నిర్వహించారు. పాటలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్లు పోటాపోటీగా వేలం పాటలో పాల్గొని, రూ.1.25 లక్షలకు ఓ కాంట్రాక్టరు కైవసం చేసుకున్నాడు. తద్వారా వరదయ్యపాళెంలోని మాంసపు దుకాణదారుల నుండి వసూళ్లు చేపడుతున్నారు. పంచాయతీ పాలకుల ఒత్తిళ్లకు తట్టుకోలేక తప్పనిసరి పరిస్థితుల్లో వారం వారం జంతు వధశాల కాంట్రాక్టరుకు రుసుం చెల్లిస్తున్నామని దుకాణదారులు చెబుతున్నారు.

జంత వధశాల లేకనే.. వసూళ్లు

సాధారణంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలంలో మాంసపు మార్కెట్(జంతువధశాల) నిర్వహణ జరిగితే ఆ ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారి నుండి రోజువారీ రుసుం పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుంది. అయితే వరదయ్యపాళెం మేజర్ పంచాయతీకి ఇప్పటి దాకా ప్రత్యేకించి జంతు వధశాల లేదు. రెండేళ్ల క్రితం గోవర్ధనపురం మారేడు కాలువ జంతు వధశాల గదుల ఏర్పాటునకు స్థలం కేటాయించారు. అంతే తప్ప అక్కడ నిర్మాణాలు కూడా పూర్తికాలేదు. అయితే ప్రతి ఏడాది పంచాయతీ ఆస్తుల అద్దెకు కేటాయింపు కోసం జరిగే వేలం పాటలో జంతు వధశాలకు ప్రత్యేకించి వేలం నిర్వహిస్తారు. అయితే ప్రత్యేకించి పంచాయతీకి సంబంధించి జంతు వధశాలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటి దాకా బాధ్యతలు నిర్వర్తించిన పంచాయతీ పాలకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ దష్టి సారించకపోవడం గమనార్హం. అయితే జంతు వధశాల లేనప్పటికీ అక్రమ వసూళ్లు మాత్రం యథావిధిగా చేపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వసూలు చేస్తున్నప్పటికీ కనీసం జంతు వధశాల మార్కెట్ ఏర్పాటుకు కసరత్తు చేయకపోవడంపై స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పూర్తి కాని గదుల నిర్మాణం

అయితే జంతు వధశాల నిర్వహణ కోసం గోవర్ధనపురం మారేడు కాలువ గట్టుపై స్థలం కేటాయించారు. 10 గదుల నిర్వహణ కోసం పునాదులు వేసి గోడల వరకు నిర్మాణాలు చేపట్టారు. అయితే గత ఏడాది సార్వత్రిక ఎన్నికలు కావడంతో నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అయితే ఆగిన పనులను పూర్తి చేసేందుకు పంచాయతీ పాలకులు కసరత్తు చేయకపోవడం గమనార్హం. ప్రతి ఏడాది పంచాయతీ పరిధిలో లేని జంతు వధశాలకు దర్జాగా వేలం పాట నిర్వహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారే తప్ప ఆ మార్కెట్ అభివృద్ధికి ఏ మాత్రం తోడ్పాటునివ్వకపోవడం ఏమిటని మాంసపు మార్కెట్ వ్యాపారస్తులు ప్రశ్నిస్తున్నారు. వసూళ్లలో ఉన్న చొరవ అభివృద్ధిపై లేదని వారి నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వరదయ్యపాళెం: ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేసేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం వరదయ్యపాళెంలోని కేబీజీ కల్యాణ మండపంలో బీజేపీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించారు. అలాగే మండలంలో పలువురిని పార్టీ పదవులకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి సిద్ధలయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ఢిల్లీప్రకాష్, మాజీ అధ్యక్షుడు వేలూరు పురుషోత్తం, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కేబీ గురుదేవ్, భాస్కర్ రెడ్డి, డీఎంఎస్ మెంబర్ గుత్తి త్యాగరాజు, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఏఈపై పని భారం

రేణిగుంట: ఎటువంటి అనుభవం లేని సచివాలయ ఉద్యోగికి మండల హౌసింగ్ ఏఈ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం పలు విమర్శలకు తావిస్తోంది. రేణిగుంట మండలంలో సుమారు నాలుగువేల మందికి గతంలో జగనన్న ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అందులో సగం మంది ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ ఏఈగా సచివాలయ ఉద్యోగిని ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఎక్కడ పనులు అక్కడే అనే విధంగా ఉంది. సచివాలయ పనులతో పాటు హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తుండడంతో అధిక పని ఒత్తిడికి లోనవుతున్నారని, అయితే ఆ ఫ్రస్టేషన్‌ను తమపై చూపుతున్నారని హౌసింగ్ లబ్ధిదారులు వాపోతున్నారు. అనుభవం ఉన్న రెగ్యులర్ ఏఈని నియమిస్తే లబ్ధిదారులతో మమేకమై పనులు వేగవంతంగా చేయిస్తామన్నారు. అనుభవం లేని సచివాలయ ఉద్యోగికి ఇన్‌చార్జ్ ఏఈగా ఇవ్వడంతో అసలు సమస్య తలెత్తదని కొందరు లబ్ధిదారులు అంటున్నారు.

కార్మికులకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలి

- సేఫ్టీ మేనేజ్‌మెంట్ పాటించని క్రోమో మెడికేర్ కంపెనీ
- ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మిక సంఘాల నేతలు



అగ్నిప్రమాద ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రేణిగుంట: గాజులమండ్యం పారిశ్రామికవాడలోని క్రోమో మెడికేర్ కంపెనీలో సోమవారం పేలుడు జరిగిన విషయం విదితమే. ఈ అగ్ని ప్రమాదంలో 60 శాతం శరీరం తీవ్రంగా కాలిపోయి కార్మికులు రవీంద్ర, వెంకటేష్ కొన ఊపిరితో చెన్నై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. దీనిపై సీఐటీయూ నాయకులు స్పందిస్తూ కంపెనీ యాజమాన్యం ఒక్కో కార్మికుడికి రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం కట్టించాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అదేవిధంగా మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కోరారు. లేనిపక్షంలో కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న క్రోమో మెడికేర్ కంపెనీ యాజమాన్యంకు వ్యతిరేకంగా జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఘటనా స్థలిని పరిశీలించిన పలువురు

క్రోమో మెడికేర్ పరిశ్రమను మంగళవారం వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జీపాల్యం తేజోవతి, బీజేపీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప పరిశీలించారు. అధికారులతో చర్చించి జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కార్మికుల రక్షణకు తీసుకున్న జాగ్రత్తలపై వాకబు చేశారు. పరిశ్రమలో ప్రమాద నివారణ పరికరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ అధిష్టానం దృష్టికి గ్రావెల్ పంచాయితీ

- సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా నాలుగు రోజులుగా ఆగిన గ్రావెల్ అక్రమ రవాణా
- నియోజకవర్గానికి కో–ఆర్డినేటర్ నియామకంతో తెరమీద కొచ్చిన గ్రావెల్ పంచాయతీ
- గతంలో సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త కనుసన్నల్లో గ్రావెల్ అక్రమ రవాణా
- ఆయనకు చెక్ పెట్టే దిశగా కో–ఆర్డినేటర్ అడుగులు



సత్యవేడు నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణా(ఫైల్)

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సత్యవేడు నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అయితే తాజాగా నియోజకవర్గానికి టీడీపీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శంకర్‌రెడ్డిని నియమించారు. దీంతో గ్రావెల్ అక్రమ రవాణా తన కనుసన్నల్లో జరిగేందుకు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి ఎక్కడికక్కడ అక్రమ రవాణాను ఆపి వేశారు. దీంతో నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లో జరుగుతున్న గ్రావెల్ అక్రమ రవాణా గత నాలుగు రోజుల నుండి అక్రమ రవాణా ఆగిపోయింది. అంతేగాక ఈ పంచాయతీ అమరావతికి చేరింది. టీడీపీ హైకమాండ్ దృష్టికి గ్రావెల్ పంచాయతీ చేరుకుంది. ఇప్పటి వరకూ సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కనుసన్నల్లో.. తన అనుచరగణం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా జరిగేది. దీంతో రోజువారీ పెద్ద ఎత్తున తమిళనాడుకు సత్యవేడు నియోజకవర్గం నుండి వందల లారీల్లో తమిళనాడుకు ఎర్రమట్టిని తరలిస్తూ టీడీపీ నేతలు కోట్ల రూపాయలు జేబులు నింపుకుంటున్నారు.

కో–ఆర్డినేటర్ వర్సెస్ పారిశ్రామికవేత్త

సత్యవేడు నియోజకవర్గంలో గ్రావెల్ పంచాయతీ రంజుగా మారింది. ఇన్నాళ్లు సూళ్లూరుపేటకు చెందిన పారిశ్రామికవేత్త అనుచరగణం కనుసన్నల్లో జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. తాజాగా పది రోజుల క్రితం సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన వ్యాపారవేత్త శంకరరెడ్డి నియమితులయ్యారు. అయితే వారం రోజుల క్రితం ఆయనను నియోజకవర్గ పార్టీ శ్రేణులకు పరిచయం చేసేందు కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రావెల్ అక్రమ రవాణా, ఇతర సమస్యలను ఏకతాటిపై నడిపే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ దిశగా గ్రావెల్ అక్రమ రవాణాను నియోజకవర్గ వ్యాప్తంగా నిలిపివేశారు.

హైకమాండ్ మద్దతు ఎవరికో?

ఇప్పటికే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, నియోజకవర్గంలో టీడీపీని ఓడించాలని కుట్రలు పన్నిన వారిని వెంటబెట్టుకుని నియోజకవర్గంలో పర్యటించడంపై స్థానిక శాసనసభ్యుడు అసమ్మతి గళాన్ని రెండు రోజుల క్రితం వినిపించా రు. నియోజకవర్గానికి ఎంత మంది ఇన్‌చార్జ్‌లు వస్తారని, అసలు ప్రోటోకాల్ లేని మీరు అధికారిక కార్యక్రమాల్లో పెత్తనం చెలాయించడమేమిటని ఆయన బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, తన సమక్షంలోనే అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు జరగాలని, అందుకు అధికారులందరూ సహకరించాలని, నిబంధనలకు వ్యతిరేకంగా అధికారులు ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్ప వని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రావెల్ పంచా యితీ ఎవరికి అనుకూలమయ్యేనో తెలియని పరిస్థితి. తాజాగా మంగళవారం నియోజకవర్గ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి అమరావతిలో సీఎం చంద్రబాబును కలసి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను కూలంకుషంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంలో గ్రావెల్ పంచాయతీ కూడా చర్చకు వచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఎవరి కనుసన్నల్లో గ్రావెల్ అక్రమ రవాణా కొనసాగుతుందో వేచి చూడాల్సి ఉంది.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన

రేణిగుంట: పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓల్డ్ యూత్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శక్తి మొబైల్ యాప్, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మహిళ తన మొబైల్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే, పోలీసులు వెంటనే స్పందించి రక్షణ కల్పిస్తారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఆకర్షణలు, ప్రలోభాలకు లోనవకుండా తల్లిదండ్రులకు గౌరవం తెచ్చేలా ప్రవర్తించాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కార్యక్రమంలో అర్బన్ సీఐ జయచంద్ర, ఏఎస్ఐ పార్వతి, శక్తి బృందం సిబ్బంది, పాఠశాల హెచ్ఎం శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్ : అలిపిరి పాదాల మండపంలోని ఆలయాల్లో మంగళవారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, కర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాలతో ఆలయాల్లో ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ ఎ.భాస్కర్ నారాయణ్ చౌదరి పాల్గొన్నారు.



ఆలయ శుద్ధి చేస్తున్న అధికారులు, అర్చకులు

ఆడికృత్తిక ఏర్పాట్ల పరిశీలన



నారదపుష్కరణి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో బాపిరెడ్డి



సిద్ధమవుతున్న తెప్పలు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం ఈఓ బాపిరెడ్డి, పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సామాన్య భక్తులకు సర్వదర్శనం కల్పించేలా క్యూలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే వీఐపీలకు కూడా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశామన్నారు. ఇక నారదపుష్కరణిలో తలనీలాలు సమర్పించే భక్తులకు స్నానఘట్టాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ గోపి, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : వ్యక్తి మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్ సూర్యముని

రేణిగుంట : తిరుపతి నుంచి పుత్తూరుకు వెళుతున్న ఆటో బోల్తా పడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. తిరుపతికి చెందిన డ్రైవర్ సూర్యముని (48) తన సొంత ఆటోలో పుత్తూరుకు వెళ్తుండగా గాజులమండ్యం వంతెనపైన అదుపు తప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ పూజలు జరిగాయి. ఆలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద పూజలు చేశారు. అలాగే బుధవారం అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.



పుట్టమన్ను